నల్లచెరువు అభివృద్ధిని మరిచారా?

- చెరువును దత్తత తీసుకొని పనులను నిలిపి వేసిన హైడ్రా
- అప్పటికే కోనేరు నిర్మాణం ప్రారంభం
- పనులు నిలిపి వేయడంపై ఆగ్రహం

కూకట్‌పల్లి: వేసవి కాలం ముగిసే లోగా చెరువుల అభివృద్ధి పనులను ముగించాల్సిన హైడ్రా అధికారులు ఇప్పటి వరకు పనులను ప్రారంభించలేదు. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని నల్ల చెరువులో నెల రోజుల క్రితం నీటిని తోడి చెరువు పూడికతీత పనులను ప్రారంభిస్తామని హైడ్రా అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. చెరువు పనులు ప్రారంభించిన తర్వాత మూడు నెలల వరకు పూడికతీత పనులకే సమయం పడుతుంది. ఒకవైపు భూగర్భ జలాలన్నీ అడుగంటి బోర్లు పనిచేయడం లేదని ప్రజలు గోడు వినిపిస్తున్నారు. ఇదిలా ఉండగా జీహెచ్ఎంసీ అధికారులు బతుకమ్మ నిమజ్జనాల కోసం కోనేరు నిర్మించడానికి రూ.20 లక్షలు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. ఇటీవల హైడ్రా అధికారులు నల్ల చెరువును స్వాధీనం చేసుకున్న సమయంలో కోనేరు పనులను నిలిపి వేయాలని ఆదేశించారు. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు పనులను నిలిపివేశారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకొని అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించకుండా హైడ్రా అధికారులు ముందుకు సాగాలని పలువురు కోరుతున్నారు. నల్ల చెరువును అభివృద్ధి చేయాలంటే కొన్ని న్యాయపరమైన చిక్కులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. గతంలోనే ఇక్కడ పట్టాలు ఉన్న రైతులు తమకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే అభివృద్ధి పనులు చేపట్టాలని కోర్టును ఆశ్రయించారు. ఈ విషయంపై హైడ్రా ఉన్నతాధికారులను కూడా రైతులు సంప్రదించడంతో సమస్యను పరిష్కరించడానికి వారు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో ఇక్కడ పనులు నిలిపివేసినట్లు సమాచారం.


నల్ల చెరువు వద్ద ఆగిపోయిన కోనేరు నిర్మాణం

కోనేరు నిర్మాణానికి అనుమతివ్వాలి



స్థానికులకు, ప్రజా ప్రతినిధులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా హైడ్రా అధికారులు అభివృద్ధి పనులను నిలిపివేశారు. స్థానికుల ఆకాంక్ష మేరకే కోనేరు నిర్మాణానికి శ్రీకారం చుట్టాము. ఎన్నో రోజులు శ్రమిస్తే ఈ అభివృద్ధి దక్కింది. అకస్మాత్తుగా హైడ్రా అధికారులు కోనేరు నిర్మాణాన్ని ఆపడం వల్ల వచ్చే పండుగకు మహిళలకు బతుకమ్మ పండుగ నిర్వహించుకునేందుకు కష్టంగా మారుతుంది. ఈ కోనేరు నిర్మాణం కేవలం వేసవి కాలంలోనే నిర్మించడానికి అనువుగా ఉంటుంది. ఈ విషయాన్ని గ్రహించి అధికారులు కోనేరు నిర్మాణానికి అనుమతివ్వాలి.

– జూపల్లి సత్యనారాయణ, కార్పొరేటర్, కూకట్‌పల్లి

నేడు మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉగాది వేడుక

మోతీనగర్: మోతీనగర్ క్రాస్ రోడ్డు, మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం సాయంత్రం 5.45 గంటలకు శ్రీవిశ్వావసు నామ సంవత్సర చైత్ర శుద్ధ పాడ్యమిని పురస్కరించుకొని ఉగాది వేడుక నిర్వహించనున్నట్లు మధురానగర్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మాననీయ నగర సంఘ చాలక్ డా. ఎస్.కె. జైస్వాల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



కూకట్‌పల్లి: శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో అనుకున్న పనులు విజయవంతంగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. ఉగాది పచ్చడిలో తీపి, పులుపు, చేదు, వగరులాగా జీవితం సమ్మిళితమైందని, కష్టాలు వచ్చాయని కుంగిపోకుండా వాటిని ధైర్యంగా ఎదుర్కొనే మార్గం కచ్చితంగా ఉంటుందన్నారు. దానిని అన్వేషించి ముందుకు సాగాలని, ఆయురారోగ్యాలతో సుఖ తోషాలతో ఉండాలన్నారు.

ఉద్యోగ విరమణ.. సన్మానం



కేపీహెచ్‌బీకాలనీ: విధి నిర్వహణలో తమదైన గుర్తింపును సొంతం చేసుకొని ఉద్యోగ విరమణ చేసిన ఇద్దరు బోధనేతర సిబ్బందికి జేఎన్‌టీయూహెచ్ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం జేఎన్‌టీయూహెచ్‌లోని ఆడిటోరియంలో యూనివర్సిటీ ఫారిన్ రిలేషన్స్ విభాగంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి. కిషన్, యూజీసీ విభాగం సూపరింటెండెంట్ యూ. రవీందర్‌రావు దంపతులను రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు సన్మానించారు. వారి సేవలను గుర్తు చేశారు.

పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు


విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న సీఐ నర్సింహ

ఆల్విన్‌కాలనీ: పాపిరెడ్డినగర్‌లోని రెయిన్ బో స్కూల్ యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుక శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరంలో నేర్చుకున్న అత్యుత్తమమైన విషయాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ నర్సింహ, కాలనీ అధ్యక్షులు చంద్రారెడ్డి హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ విష్ణువర్ధన్ రెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ సునీత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో క్లీనప్ డ్రైవ్



రాయదుర్గం: హెచ్‌సీయూ క్యాంపస్‌ను శుభ్రంగా, ఆహ్లాదకరంగా మార్చడమే లక్ష్యంగా ఎన్ఎస్ఎస్ పనిచేస్తుందని హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య తెలిపారు. శనివారం హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో క్లీనప్ డ్రైవ్ కార్యక్రమాన్ని హార్టికల్చర్, పారిశుద్ధ్య విభాగాల సమన్వయంతో నిర్వహించారు. వలంటీర్లు వ్యర్థాలను తొలగించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు.

అలరించిన అన్నమయ్య కీర్తనలు

మాదాపూర్: కళాకారులు అన్నమాచార్య కీర్తనలను ఆలపించి సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా సుమంగళి శిష్యబృందం అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. గోవింద గోవింద, రామచంద్రుడితడు, తిరువీధుల మెరిసి, నిగమా నిగమాంత అంటు కళాకారులు అక్షత, శ్రీనిధి, తేజస్వి, వైష్ణవి మారోజు, గ్రీష్మ, వైష్ణవి, అభిషేక్, శౌర్యచంద్రలు ఆలపించారు. వీరికి కీబోర్డు సత్యదేవ్, తబలా భూమేష్ సంగీత వాయిద్య సహకారాన్ని అందించారు.

సమతానగర్ సమస్యలు పరిష్కరిస్తా

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని సమతానగర్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. శనివారం స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి కాలనీలో పర్యటించారు. కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలించారు. అదే విధంగా కాలనీలో వీధి దీపాలు వెలగటం లేదని, కాలనీకి మూడు విద్యుత్ స్తంభాలు అవసరం ఉన్నాయని కాలనీ వాసులు కార్పొరేటర్‌ను కోరారు. దీనికి స్పందించిన కార్పొరేటర్.. త్వరలో వీధి లైట్ల సమస్యను పరిష్కరించి, మూడు స్తంభాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నర్సింహులు, సతీష్‌గౌడ్, కేబీఎస్ నారాయణ, ఈ. లింగస్వామి, కె. యాదగిరి, వెంకటేష్, భాస్కరరావు, సుకృతకుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సతీష్ గౌడ్ తదితరులు

ఇండోర్ స్టేడియం సమస్యలు పరిష్కరించాలి


సమస్యలను పరిశీలిస్తున్న సంక్షేమ సంఘం సభ్యులు

మోతీనగర్: గాయత్రినగర్ ఇండోర్ స్టేడియంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని గాయత్రి నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు పి. కృష్ణారావు అన్నారు. శనివారం ఇండోర్ స్టేడియాన్ని కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్తా చెదారాన్ని తరలించటంతో పాటు వీధి లైట్లకు ఆన్ ఆఫ్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా స్టేడియం ఆవరణలో ఉన్న మూత్ర శాలలు అపరిశుభ్రంగా ఉండటంతో క్రీడాకారులు, స్టేడియానికి వచ్చే సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వెంకటరమణ గుప్తా, జితేంద్ర, నందు, కృష్ణారెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉగాది, రంజాన్ వేడుకలు


శ్రీ సాయి విద్యానికేతన్ స్కూల్‌లో నిర్వహించిన ఉగాది వేడుకలో విద్యార్థులు

ఉగాది పచ్చడి తయారు చేసిన విద్యార్థులు


నియో గీతాంజలి స్కూల్‌లో.. పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


పంచశీల స్కూల్‌లో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న విద్యార్థులు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో శనివారం ఉగాది, రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఉగాది పచ్చడి తయారు చేసి, పంచాంగ శ్రవణం వినిపించారు. ముస్లింలు స్వీట్ తయారు చేసి ఒకరికొకరు తినిపించుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీసాయి విద్యానికేతన్ స్కూల్‌లో...

మూసాపేటలోని శ్రీ సాయి విద్యానికేతన్ స్కూల్‌లో విద్యార్థులు షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని తయారు చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గార్లపాటి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియో గీతాంజలి స్కూల్‌లో..

కూకట్‌పల్లి: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నిజాంపేటలోని నియో గీతాంజలి స్కూల్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలు ధరించి ఆకట్టుకున్నారు. నియో గీతాంజలి డైరెక్టర్ రమాదేవి, ప్రిన్సిపాల్ రఘుబాలలు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉగాది పచ్చడిని విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో స్కూలు టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెరువులను కాపాడతాం: ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: హఫీజ్‌పేట్, మియాపూర్ డివిజన్ల పరిధిలోని కాయిదమ్మకుంట, మక్తమహబూబ్‌పేట్ చెరువులను సుందరీకరిస్తున్నామని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శనివారం హఫీజ్‌పేట్, మియాపూర్ డివిజన్ల పరిధిలోని కాయిదమ్మకుంట, మక్తా చెరువుల సుందరీకరణలో భాగంగా నెక్సస్ సెలెక్ట్ మాల్స్ వారి సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెరువు పునరుద్ధరణ పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులను సంరక్షిస్తామన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకువస్తామన్నారు.


మక్తమహబూబ్‌పేట్ చెరువు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

నేటి నుంచి శ్రీమద్రామాయణ నవాహ్నిక జ్ఞాన యజ్ఞ మహోత్సవం

మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీశృంగేరి శారద శంకర మఠంలో జగద్గురువులు భారతీతీర్థ మహాస్వామి వారి శ్రీ విధుశేఖరభారతీ స్వామివారి దివ్యాశీస్సులతో, బ్రహ్మశ్రీ డా. కడిమిళ్ల వరప్రసాద్ పర్యవేణలో శ్రీమద్రామాయణ నవాహ్నిక జ్ఞాన యజ్ఞ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మోతీనగర్ పరిసర ప్రాంత భక్తులు ఈ యజ్ఞ మహోత్సవంలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పేకాడుతున్న 9 మంది అరెస్ట్

రూ.54 వేలు, 8 సెల్‌ఫోన్‌లు స్వాధీనం

మూసాపేట : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.54 వేలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మూసాపేటలోని రెయిన్ బో విస్టాస్ అపార్ట్‌మెంట్ ఎస్ బ్లాక్ లోని ఫ్లాట్ నంబర్ 103లో వివిధ ప్రాంతాలకు చెందిన 10 మంది పేకాడుతున్నారు. సమాచారం తెలుసుకున్న బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు శుక్రవారం సాయంత్రం దాడి చేసి రూ.54 వేలు, 8 సెల్ ఫోన్లు, 20 సెట్ల ప్లేకార్డులను స్వాధీనం చేసుకున్నారు. 9 మందిని అరెస్టు చేశారు. జయవర్ధన్ రెడ్డి పరారీలో ఉన్నాడు. యూసుఫ్‌గూడకు చెందిన ఈవెంట్ మేనేజర్ పల్లె శంకర్ గౌడ్ (49), నాచారానికి చెందిన కూరగాయల వ్యాపారి పొన్నం రామచందర్ గౌడ్ (54), ఫతేనగర్ కు చెందిన కాంట్రాక్టర్ వెంకటరాజు (51), కొత్తపేట కు చెందిన పండ్ల వ్యాపారి కిరణ్ కుమార్ (42), ఎల్బీనగర్‌కు చెందిన శ్రీనాథ్ (32), ఎల్బీనగర్‌కు చెందిన డ్రైవర్ మధు (30), చైతన్యపురికి చెందిన సోమ శంకర్ రెడ్డి (38), చింతల్‌కు చెందిన పత్తి మహేష్ (28), యూసుఫ్‌గూడకు చెందిన చెందిన బాలయ్య (55)లను అరెస్ట్ చేశారు. ఈ మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

12 మంది సెక్స్‌వర్కర్ల ..

రాయదుర్గం: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 12 మంది సెక్స్ వర్కర్లను అరెస్ట్ చేసి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. సైబరాబాద్‌లోని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్స్ (ఏహెచ్‌టీయూ) డీసీపీ, డబ్ల్యూ అండ్ సీఎస్‌డబ్ల్యూ పర్యవేక్షణలో కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ పరిధిలోని భాగ్యనగర్ బస్టాప్ వద్ద, కూకట్‌పల్లి, మాదాపూర్ ప్రాంతాలలో నిర్వహించిన ఆపరేషన్‌లో వీరిని అరెస్ట్ చేశారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లలో అనైతిక (నివారణ) చట్టం1956 కింద కేసులు నమోదు చేశారు. అనంతరం వారికి సైబరాబాద్ అధికారులు కౌన్సిలింగ్ ఇచ్చి బైండోవర్ చేశారు.

బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముఠా ..

రూ.53 వేలు, 5 సెల్‌ఫోన్‌లు, ఒక కారు, 20.66 లక్షలు ఆన్‌లైన్ బ్యాలెన్స్ సీజ్

చందానగర్: బెట్టింగ్‌యాప్స్‌తో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముఠాను శనివారం మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. మియాపూర్ సీఐ క్రాంతి కిరణ్ తెలిపిన ప్రకారం వివరాలు...మియాపూర్‌కు చెందిన మాదిశెట్టి అజయ్ (46), రాజస్థాన్‌కు చెందిన జీత్ శర్మ (30), మియాపూర్‌కు చెందిన మాదిశెట్టి సంధ్య (40), బాసిబోయిన సుమంత్ (28), బీర గణేష్‌కుమార్ (31)లు కలిసి క్రికెట్ యాప్స్ క్రిక్ 24/7, నైస్ 7777, యోప్ 2020లతో మియాపూర్ న్యూహఫీజ్‌పేట్‌లోని మార్తాండనగర్‌లో గుట్టు చప్పుడు కాకుండా బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు మియాపూర్ న్యూహఫీజ్‌పేట్‌లో వారి నివాసంపై దాడి చేశారు. అక్కడే ఉన్న 5 మందిని అదుపులోకి తీసుకొని మియాపూర్ పోలీసులకు అప్పగించారు. వారి వద్ద నుంచి రూ.53వేల నగదు, 5 సెల్‌ఫోన్లు, హుండాయ్ ఐ20 కారు, ఆన్‌లైన్ అకౌంట్ బ్యాలెన్స్ రూ.20,60,603లు సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరో ఇద్దరు నిందితులైన సురేష్ గవల, మాదిశెట్టి కరలు పరారీలో ఉన్నారన్నారు.త్వరలో నేవారిని కూడా పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

స్పోర్ట్స్ హబ్‌గా హైదరాబాద్

- ఆసియా కరాటే చాంపియన్‌షిప్ 2027 హైదరాబాద్‌లోనే..
- టీపీసీసీ అధ్యక్షుడు, కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

గచ్చిబౌలి: హైదరాబాద్ నగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా మారుస్తున్నామని, సీఎం ప్రత్యేక చొరవతో అందుకు అడుగులు పడుతున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు, కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీబాలయోగి స్టేడియంలో నాలుగు రోజుల పాటు సాగిన కరాటే పోటీలు ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2027 లో ఆసియా కరాటే చాంపియన్‌షిప్ పోటీలు హైదరాబాద్ నగరంలో జరుగుతాయని స్పష్టం చేశారు. ఈ పోటీలలో ఓవరాల్ చాంపియన్స్‌గా ఢిల్లీ, మధ్యప్రదేశ్, హర్యానా జట్లు నిలిచాయి. ఈ పోటీలలో 28 రాష్ట్రాలతో పాటు ఆర్మీ పారామిలటరీ విభాగాలకు చెందిన 36 జట్లు పాల్గొన్నాయి. కాగా ఈ పోటీల ముగింపు సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని పంపించారు. ఈ కార్యక్రమంలో శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోనిబాల, కరాటే ఇండియా అధ్యక్షుడు భారత్‌శర్మ, నిర్వాహకులు కీర్తన్, రామస్వామి పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి


కమిటీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న గాంధీ

ఆల్విన్‌కాలనీ: కాలనీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు. వెంకట పాపయ్య కాలనీ నూతన అధ్యక్షులు జూపల్లి జనార్దన్‌రావును శనివారం ఎమ్మెల్యే సన్మానించారు. కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం ముఖ్య సలహాదారుడు బైండ్ల నరసింహ తదితరులు

మోతీనగర్: బైండ్ల కుల సంఘం ముఖ్య సలహాదారుడు బైండ్ల నరసింహ ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా ఏర్పాటు చేసిన క్యాలెండర్‌ను శనివారం వివిధ జిల్లాల ప్రతినిధులతో కలిసి అల్లాపూర్ డివిజన్, హరి నగర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బైండ్ల కులసంఘం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బైండ్ల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు బైండ్ల కృష్ణ, జిల్లా కార్యదర్శి బైండ్ల యాదగిరి, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.